

14,795 మందికి 'జగనన్న చేదోడు'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 14,795 మందికి జగనన్న చేదోడు ద్వారా రూ.14.79 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి జగనన్న చేదోడు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023-24వ సంవత్సరానికి సంబంధించి జగనన్న చేదోడు పథకం కింద అర్హులైన 14,795 మంది రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ.14.79 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ.14.79 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ గాయత్రీ దేవి, వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ రిజ్వాన్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, బిసి కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రజక, నాయీ బ్రాహ్మణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కుయ్..కుయ్‌కి సుస్తి..!

◆ నిర్వహణ లేక తలెత్తుతున్న సమస్యలు ◆ సిబ్బందికీ తప్పని వెతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అపత్కాలంలో వేగంగా చేరుకుని సామాన్యుల ప్రాణాలను నిలిపే 108 వాహనాలకు సుస్తి చేసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే 2020 జులై నెలలో కొత్త వాహనాలొచ్చాయి. వాటికి సరైన మరమ్మతులు, నిర్వహణ సకాలంలో లేకపోవడంతో వాటికి సుస్తి చేస్తున్నాయి. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవడం, కండిషన్ లేకపోవడం వంటివి జరుగుతున్నాయి. దీంతో ఆపత్కాలంలో వేగంగా బాధితుల వద్దకు చేరోవడంలోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. మడకశిరలో నాలుగు రోజులు క్రితం ఒక బాలుడి మృతి చెందిన సమయంలో వాహనం లేకపోవడంతో మృతదేహాన్ని ద్విచక్ర వాహనంలో తరలించే ఘటన చోటు చేసుకుంది. దీంతో 108 వాహనాల నిర్వహణపై సర్వత్రా చర్చ నడుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిఘా వర్గాల ద్వారా ఈ వాహనాల పనితీరుపై ఆరా తీసినట్టు సమాచారం. అయితే అధికారులేమో అంతా బేష్ అని సర్ధిజెప్పే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

సగానికిపైగా వాహనాల్లో సమస్యలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 108 వాహనాలు 68 ఉన్నాయి. ఇందులో ఎన్ని కండిషన్ ఉన్నాయి.. ఎన్ని లేవన్న దానిపై అధికారుల్లోనే స్పష్టత లేకుండా ఉంది. అనంతపురం నగరం పరిసరాల్లోనే ఎంజి పెట్రోల్‌బంకు, రాప్తాడు సమీపంలో నిత్యం మరమ్మతులకు గురవుతూ ఈ వాహనాలు కనిపిస్తూనే ఉంటాయి. దాదాపు సగానికిపైగా వాహనాలు కండిషన్‌లో లేనట్టు సమాచారం. కనీసం స్టెఫీ కూడా లేకుండా కొన్ని నడుస్తుండగా, కొన్నింటి రాత్రి సమయాల్లో లైట్లు కూడా పడని పరిస్థితులున్నాయి. ఇంకొన్నింటికి బ్రేకులు కూడా సరిగాపడని దాఖలాలూ ఉన్నాయి. ఉదాహరణ ఇటీవలనే బెళుగుప్ప మండలం గుండ్లపల్లి వద్ద బ్రేకులు పడక వాహనం ఆగివున్న ట్రాక్టరును ఢీ కొట్టింది. గుమ్మగట్ట వద్ద జరిగిన ప్రమాదంలో ఏకంగా 108 వాహన డ్రైవరు ప్రమానాకి గురై చనిపోవడం జరిగింది. తాజాగా కనగానపల్లి మండలంలోనూ ఒక వాహనం ప్రమాదానికి గురైంది. ఇలా తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో అటు సిబ్బంది, ఇటు రోగులు అపత్కాలంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.

బాధ్యులు సిబ్బందే...

వాహనాలను వేగంగా నడిపే సమయంలో ఎక్కడైనా చిన్నపాటి ప్రమాదం జరిగినా బాధ్యులు సిబ్బందే అవుతున్నారు. ప్రమాదంలో మరణిస్తే కనీసం ప్రభుత్వం వైపు నుంచి సహాయం కూడా అందని పరిస్థితులు నెలకొన్నాయి. గుమ్మగట్ట ప్రమాదంలో 108 వాహన డ్రైవర్ చనిపోతే ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి ఆర్థిక సహాయం అందలేదు. తోటి సహోద్యోగులే కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇక బెళుగుప్ప వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్‌ను బాధ్యుడిని చేసి ఐదు నెలలు వీధుల్లోకి తీసుకోకుండా అది. కారులు నిలిపేశారు. ఇలా ప్రమాదాలకు సిబ్బందినే అధికారులు బాధ్యులే చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. వేతనాలు కూడా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 280 మంది వరకు 108 వాహన సేవల్లో పాల్గొంటు న్నారు. వీరికి ఇప్పటికీ మూడు మాసాలుగా వేతనాలు అందలేదు.

సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి

108 వాహన సేవల్లో పాల్గొనే సిబ్బంది ఆపత్కాలంలో ప్రజల ప్రాణాలను నిలిపే పనిలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్నారు. అట్టి వారికి ప్రభుత్వం వైపు నుంచి సహకారం తోడ్పాటును మరింత అందివ్వాల్సి ఉంది. వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా ఏదైనా జరిగితే వారినే బాధ్యులు చేస్తుండటం శోచనీయం. ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునే చర్యలు కూడా ప్రభుత్వం వైపు నుంచి లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం 108 వాహనాల మరమ్మతులతోపాటు, సిబ్బంది సమస్యలను పట్టించుకుని పరిష్కరించాలి.

నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు.

పండ్లతోటల రైతులపై నిర్లక్ష్యం

- ◆ ప్రోత్సాహం అందించని ప్రభుత్వాలు
- ◆ సమస్యలపై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి
- ◆ పండ్లతోటల రైతుల సమస్యలపై రాష్ట్ర సదస్సులో నాయకులు



పండ్ల తోటల రైతుల రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

పండ్ల తోటల సాగు చేసే రైతులకు ఎలాంటి ప్రోత్సహకాలు అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయని రైతుసంఘం నాయకులు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో పండ్ల తోటల రైతుల సమస్యలపై రాష్ట్ర సదస్సును గురువారం నిర్వహించారు. పండ్లతోటల రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, విజయనగరం తదితర 12 జిల్లాల్లో లక్షలాది మంది రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో వీటి సాగు మరింత ఎక్కువగా ఉందన్నారు. గత ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని పండ్లతోటల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆచరణలో సాగు రైతులకు అందించిన సాయం అంతంత మాత్రమే అన్నారు. మార్కెట్ సౌకర్యం, పండిన పండ్లను నిలువ చేసుకునేందుకు అవసరమైన శీతల గిడ్డంగుల నిర్మాణం, మద్దతు ధరలు వచ్చేలా నిర్దిష్టమైన ధరల విధానం వంటివి అమలు చేయడంలో విఫలం అయ్యిందన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక పండ్ల తోటలను పూర్తిగా విస్మరించిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహన్ని కూడా ఇవ్వలేదన్నారు. పండ్లతోటలు ఎక్కువగా సాగు అవుతున్న ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అభివద్ధి చేస్తామని, రైతులు పండించే పండ్లకు నుంచి మార్కెట్ సౌకర్యం కల్పిస్తామనే హామీని ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి పండ్ల తోటలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల్లో ధైర్యం నింపాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రకాల పండ్ల తోటలకు మాత్రమే పంటల బీమా అమలు చేస్తూ ఆచరణలో పండ్ల తోటల రైతులను నిరుత్సాహానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండ్ల తోటల రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పండ్ల తోటల రైతుల సమస్యలపై 10 తీర్మానాలను సమావేశంలో ప్రవేశపెట్టారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించి వీటి పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు నిర్వహించేలా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు బిహెచ్.రాయుడు, జగన్మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా రైతు సంఘం నాయకులు నరసింహ, కడప జిల్లా రైతు సంఘం నాయకులు దస్తగిరి రెడ్డి, తాడిపత్రి మండల కమిటీ నాయకులు రాజారామిరెడ్డి, శిరీష, రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు

1. అన్ని రకాల పండ్లకు మద్దతు ధరల విధానం ప్రవేశపెట్టాలి.
2. పండ్ల తోటలకు, దిగుబడి ఆధారిత వాతావరణ సమగ్ర పంటల బీమా పథకం అమలు పరచాలి. బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి.
3. పండ్ల తోటలున్న ప్రాతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు సహకార ప్రభుత్వ రగంలో స్థాపించాలి.
4. పండ్లు నిలువ చేసుకునేందుకు సహకార శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.
5. పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా పండ్ల మార్కెట్లు ఏర్పాటు చేయాలి. మార్కెట్లలో దోపిడీలను అరికట్టడానికి చర్యలు చేపట్టాలి.
6. డ్రిప్, స్ప్రింక్లర్లు, ఇతర పరికరాలు 90 శాతం సబ్సిడీపై ఇవ్వాలి.
7. ఈ ఏడాది పండ్ల తోటలు డీ హైడ్రేషన్ పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలి.
8. బోర్లు ఎండిపోయిన రైతులకు ఉచితంగా బోర్లు వేయాలి.
9. రైతు భరోసా పథకాన్ని రూ. 25వేలకు పెంచాలి.
10. పండ్ల తోటలున్న ప్రాంతాల నుంచి రైల్వే రవాణా సౌకర్యం దేశంలోని అన్ని ప్రాంతాలకు ఏర్పాటు చేయాలి. తీర్మానాలను రాష్ట్ర సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

అన్ని సదుపాయాలతో నూతన వైద్యశాల

◆ అభివృద్ధి వైపుగా ఆర్టీసీ అడుగులు ◆ ఏపీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, ఛైర్మన్ అబ్బిరెడ్డి గారి మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



ఆసుపత్రి వద్ద శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అనంతపురం బస్ స్టేషన్‌లో ఆర్టీసీ ఉద్యోగుల కోసం అన్ని సదుపాయాలతో నూతన వైద్యశాలను నిర్మించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎమ్‌డి ద్వారక తిరుమలరావు, ఛైర్మన్ అబ్బిరెడ్డి గారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. రూ.67.74 లక్షల అంచనా విలువతో అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన వైద్యశాలను ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ మంజులతో కలిసి గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఉపయోగపడే విధంగా అన్ని రకాల సదుపాయాలతో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అధునాతన సదుపాయాలతో వైద్యశాలలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఉన్న వైద్యశాలలను అధునాతనంగా మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బంది పడరాదన్న ఉద్దేశంతో ప్రతి నెలా 1వ తేదీనే వారికి వేతనాలు ఇస్తున్నామన్నారు. కొత్తగా 2,500 బస్సులు కొనుగోలు చేశామని, రెండు నెలల్లోగా కొత్త బస్సులు అన్నీ రోడ్లమీదకి వస్తాయన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీకి 18 డిస్పెన్సరీలు, రెండు ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది ఆరోగ్య సమస్యలపై పూర్తి స్థాయిలో ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరూ ప్రభుత్వ ఉద్యోగులని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కారణమన్నారు. ప్రజలు కూడా ఆర్టీసీలో ప్రయాణించి దాని అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు దానిని అమలు చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి ఎలా అయితే పెన్షన్ వస్తుందో అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు కూడా పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని తదితరులు పాల్గొన్నారు.



నిరవధిక దీక్షల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందే

- ◆ ప్రభుత్వం స్పందించేవరకు పోరాటం
- ◆ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను అమలు చేయాల్సిందే అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలను గేయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకుండా దేశానికంతటికీ ఆదర్శమని చెబుతున్న జిపిఎస్ విధానం, సిపిఎస్‌కు మరొక రూపం తప్ప ప్రత్యామ్నాయం కాదని విమర్శించారు. ప్రభుత్వం నమ్మించి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. 2024 ఎన్నికల్లో ఓపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పే పార్టీలకే ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు మద్దతు ఇస్తాయని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.లింగయ్య, వి.గోవిందరాజులు మాట్లాడుతూ 33 సంవత్సరాల సర్వీసు పూర్తయితేనే 50 శాతం పెన్షన్ ఇచ్చే జిపిఎస్, కాంట్రిబ్యూషన్ కట్టించుకునే జిపిఎస్ ఉద్యోగుల పాలిట మరణ శాసనం అన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్‌వివి రమణయ్య మాట్లాడుతూ అక్టోబర్ 18న ప్రారంభమైన దీక్షలు ఓపిఎస్ సాధించేవరకు నిరవధికంగా కొనసాగుతాయని తెలియజేశారు. అక్టోబర్ 20 నుంచి పాత తాలూకా కేంద్రాల్లో కూడా దీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ దీక్షలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఆర్.రామప్ప చౌదరి, సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేంద్రమ్మ, ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ప్రమీల, అబ్దుల్ వహాబ్ ఖాన్, రాముడు, లక్ష్మీదేవి, కల్పన, రఘు, శ్రీనివాసులు, ఉమాపతిలు కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు హనుమంత రెడ్డి, సంజీవ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సూర్య నారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాలకు 'కియా' కార్ల వితరణ

అనంతపురం : కియా కార్ల కంపెనీ ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాలకు రెండు కార్లను గురువారం ఉచితంగా వితరణ చేసింది. విద్యార్థులకు ప్రాక్టీనాలజీని పెంపొందించు కునేందుకు కార్లను అందజేసినట్లు వైస్‌ఛాన్స్‌లర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాల, యూనివర్సిటీ ప్రాముఖ్యత గురించి కీయ కంపెనీ ప్రతినిధులకు విసి క్షుణ్ణంగా వివరించారు. కియా కంపెనీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ కెల్విన్ కార్లకు సంబంధించిన పత్రాలను ఉపకులపతికి అందజేశారు.

చిరుధాన్యాల సాగు మరింత పెరగాలి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం : చిరుధాన్యాల సాగు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. చిరుధాన్యాల సేకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కూడేరు మండలంలోని జల్లిపల్లి వద్ద రామాంజినమ్మ అనే మహిళా రైతు సాగు చేసిన కొర్ర పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఇతర రైతులతో కలసి ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ వారు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమామాహేశ్వరమ్మ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లోనూ చిరుధాన్యాల పంట ద్వారా దిగుబడులు సాధించడానికి వీలుంటుందని తెలిపారు. ప్రభుత్వం చిరుధాన్యాలనూ మద్దతు ధరకు సేకరించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రిన్సిపాల్ సైంటిస్టు చంద్రమోహన్ మాట్లాడుతూ సూర్యనంది అనేక కొర్ర రకం దిగుబడులు బాగా ఇస్తోందన్నారు. ఎకరానికి నాలుగు నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తోందని వివరించారు. ఇటువంటి రకాల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని సూచించారు. ఎఎఫ్ ఎకాలజీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరు జె.మురళీకృష్ణ మాట్లాడుతూ 900 స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు తమ సంస్థ ద్వారా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఆ సంస్థ ప్రతినిధి అమరరుద్రయ్య మాట్లాడుతూ ఈ ఏడాది 3500 ఎకరాల్లో చిరుధాన్యాల సాగును తమ సంస్థ ద్వారా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, జీవనోపాధులు కో ఆర్డినేటర్ రిజ్వానా, మీడియా లైజనింగ్ అధికారి ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ఫలించిన 'విద్యార్థి' పోరాటం

- ◆ అడల్ట్ ఎడ్యుకేషన్ కొనసాగింపు
- ◆ నిర్ణయం తీసుకున్న ఎస్‌కె యూనివర్సిటీ
- ◆ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎ హర్షం



అంబేద్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి సంఘాల పోరాటం ఫలించింది. విద్యార్థులు, అధ్యాపకులు లేరన్న సాకుతో తొలగించేందుకు సిద్ధం అయిన అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును యథావిధిగా కొనసాగించేలా ఎస్‌కె యూనివర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని రద్దు చేస్తున్నట్లు వారం రోజుల క్రితం యూనివర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనిని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐఎస్‌ఎ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. యూనివర్సిటీ వద్ద రిలేనిరాహార దీక్షలనూ ప్రారంభించారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులను కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రతరం తరం చేశారు. విద్యార్థి సంఘాల పోరాటానికి దిగొచ్చిన యూనివర్సిటీ అడల్ట్ కోర్సును యథావిధిగా కొనసాగిస్తూ గురువారం నిర్ణయం వెలువరించారు. దీనిపై విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళాయిస్వామి, ఎఐఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన్న, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి గిరి మాట్లాడుతూ శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును తీసివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఎ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రధాన గేటు ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. యూనివర్సిటీలో గతంలో కూడా ఎల్ఎల్‌బి మూడు సంవత్సరాల కోర్సును ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి లా కోర్సును యధావిధిగా కొనసాగిచ్చేలా ప్రకటన చేసిందన్నారు. ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును ఎత్తివేయాలని కూడా యూనివర్సిటీ యంత్రాంగం ఉన్నత అధికారులకు లేఖ రాశారన్నారు. దీనిపై వామపక్ష విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేశాయన్నారు. ఈ పోరాటానికి తలొగ్గి ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం హర్షనీయం అని తెలిపారు. ఇదేవిధంగా ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీలో ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయడానికి కషి చేయాలన్నారు. యూనివర్సిటీలో సీటు పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులను ఫీజులు పేరుతో వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు ఉమా మహేష్, నాయకులు మంజు, విశ్వ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్దు, భీమేష్ పాల్గొన్నారు.

వైసిపి సామాజిక బస్సుయాత్ర

◆ 26న శింగనమలలో ప్రారంభం ◆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అక్టోబరు 26వ తేదీ నుంచి సామాజిక బస్సు యాత్రను వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం నాడు అనంతపురం నగరంలోని కెటిఆర్ కన్వెన్షన్ హాలులో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వైసిపి ముఖ్య నేతలతో జగనన్నకు తోడు, సామాజిక బస్సు యాత్రపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ,ఎస్సీ, ఎస్టీలకు వైసిపి అధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. తెలుగుదేశం పార్టీలాగా మాటల్లో కాకుండా చేతుల్లో చూపుతున్న పార్టీ వైసిపి అని పేర్కొన్నారు. సామాజిక బస్సు యాత్రను రాయలసీమ వ్యాప్తంగా ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 9వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్ర అనంతపురం జిల్లా శింగనమలలో ఈనెల 26వ తేదిన ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఎంసిఎ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నిర్వహించి ఎంసిఎ 3వ సెమిస్టర్ (ఆర్.21), (ఆర్.20), (ఆర్.17) సప్లిమెంటరీ పలితాలు, ఎంసిఎ ఒకటవ సెమిస్టర్ (ఆర్.21), (ఆర్.20), (ఆర్.17) సప్లిమెంటరీ పలితాలు, ఎంబిఎ 3వ సెమిస్టర్ (ఆర్.21), (ఆర్.17) సప్లిమెంటరీ పలితాలు, ఎంబిఎ 1వ సెమిస్టర్ (ఆర్.21), (ఆర్.17) సప్లిమెంటరీ పలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోతున్న రైతులకు ఎకరాకు రూ.రూ.50 వేలు పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావం వల్ల సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు సాగు చేసిన చోట కూడా పంటలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా పంటల సాగు కాలేదన్నారు. సాగు చేసిన పొలాల్లో వర్షాభావం వల్ల రైతాంగం కోట్ల రూపాయల పెట్టుబడి నష్టం జరిగిందన్నారు. గత సంవత్సరం అధిక వర్షాల వల్ల ఉద్యాన పంటలు నష్టపోయాయని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల వ్యవసాయం చేయడానికి రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తక్షణం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేయాలన్నారు. పంటల నష్టం అంచనా వేసి ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, వ్యవసాయ కూలీలకు 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టే ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

ప్రతి ఒక్కరూ దేశసేవకు ముందుకు రావాలి



కుండల్లోకి మట్టిని పోస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

దేశసేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. 'మేరీ మట్టి.. మేరా దేశ్'లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం జాతీయ సేవా పథకం, సెంట్రల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అమృత్ కలష్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, సెంట్రల్ యూనివర్సిటీ డీన్ డి.రామిరెడ్డి, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ మాట్లాడుతూ యువత దేశంపై బాధ్యత కలిగి ఉండాలన్నారు. జాతీయ భావాలు కలిగి ఉండి దేశసేవకు ముందుకు రావాలన్నారు. అనంతపురం నెహ్రూ యువ కేంద్రం, రైపర్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైపర్ ఫార్మసీ కళాశాలలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత్‌కలశ్ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓ.ప్రణతి, డాక్టర్ జి.బాలాజీ, ఎం.విష్ణుప్రియ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జయమారుతి, కార్యదర్శి వై.పవన్, సభ్యులు శీను, తుకారాం, సాయికిరణ్, శేషాద్రి, సంతోష్‌నాయక్, భరత్‌సాయి, అజయ్, గణేష్, తేజస్విని, సంధ్య, స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : సిఐ



రికార్డులను తనిఖీ చేస్తున్న సిఐ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉక్కుపాదం మోపి చర్యలు తీసుకోవాలని ఉరవకొండ రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సీఐ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ రామకృష్ణయ్యకు సూచించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కర్ణాటక నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లు అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో నాటుసారా, మట్కా, పేకాట వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎవరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు చిన్నచిన్న గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంపిపి పెద్దన్న, సింగిల్‌విండో అధ్యక్షుడు శివలింగప్ప, మండల కన్వీనర్ మచ్చన్న, నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, అశోక్, ఆవులెన్న తిప్పేస్వామి, పాతన్న, తదితరులు సీఐకి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన వైసిపి నాయకులు



ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని బత్తలపల్లి టోల్‌గేట్ వద్ద గురువారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ముల్లంగి నారాయణస్వామితో పాటు పలువురు వైసిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ రాయదుర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సరైన వ్యక్తి నిలబెట్టాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మెచ్చిన అభ్యర్థి, ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థిని వైసిపి తరపున నిలబెట్టాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో లాలుసాబ్, గోవిందవాడ ఎంపిటిసి కణేకల్లు జయరామిరెడ్డి, కాశీంసాబ్, సిద్దాపురం సర్పంచి ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గాంధీనగర్ మహిళలు

బుక్కరాయసముద్రం : కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మండల కేంద్రంలోని గాంధీనగర్ చెందిన సాకే రమాదేవి, మహమ్మద్ షఫీ, రొళ్ల భాస్కర్, బి.మంజుల, వై.ముంతాజ్‌బేగం, సరస్వతి కోరారు. ఈమేరకు తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక గాంధీనగర్‌లో ప్రభుత్వం కొంత స్థలాన్ని ఆలయ నిర్మాణం నిమిత్తం 13 సెంట్లు స్థలాన్ని వదిలిపెట్టిందన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది వైసిపి నాయకులమని చెప్పుకునే వారు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. కావున వెంటనే స్పందించి కబ్జా చేసిన స్థలాన్ని ఖాళీ చేయించి కాపాడాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ వెంటనే పరిశీలించి స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడుతామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా ప్రభుత్వ స్థలాలను ఎవరు కబ్జా చేసినా స్వాధీనం చేసుకుంటామన్నారు.



సర్పంచి భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఇటుకలపల్లి సర్పంచికు పరామర్శ

అనంతపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడి నగర శివారులోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి సర్పంచి భాస్కర్‌రెడ్డిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అన్న రాజశేఖర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటన అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ పరిధిలో భానుకోట సుధాకర్‌రెడ్డి గృహప్రవేశానికి హాజరయ్యారు.

ప్రొఫెసర్లకు ఇంటర్వ్యూలు

అనంతపురం : జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అధ్యక్షతన గవర్నర్ నామినీ సమక్షంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సిఎఎస్) కింద అసోసియేట్ ప్రొఫెసర్లకి ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లకి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించేందుకు గురువారం స్థానిక ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ వి.సుమలత, స్ట్రూట్నీ సభ్యులు ఆర్.కిరణ్మయి, పి.చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్‌ఓ అనంతపురం నగర కమిటీ ఎన్నిక

అనంతపురం : నగరంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఓ) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పిడిఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ తెలిపారు. నగర కన్వీనర్‌గా సాకే అశోక్‌కుమార్, కో కన్వీనర్‌గా సంజీవ్ రాజు, కమిటీ సభ్యులుగా సందీప్, అష్రఫ్‌వలి, సంపత్, అనిల్, అభి, ముని, ప్రవీణ్, శివ, నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. దీన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

గొర్రెల కాపరులకు మందులు పంపిణీ

శింగనమల : ప్రధానమంత్రి క్రిష్ సంచాయి పథకం కింద మంజూరైన గొర్రెల మందులను వాటర్‌షెడ్ ఛైర్మన్ పట్నం నగేష్ ఆధ్వర్యంలో గురువారం కాపరులకు మందులు పంపిణీ చేశారు. దాదాపు 40 మంది కాపరులకు మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రిటర్న్ డాక్టర్ మోనోప్రియ, సర్పంచి వెంకట్‌రాముడు, డీలర్ మల్లికార్జునరెడ్డి, వాటర్ ఎఇ వెంకట్‌నారాయణ, గంగాధర్, గోపాలమిత్ర మునీంద్ర, బాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

22న 'రాచపాలెం'కు జీవిత సాఫల్య పురస్కారం అందజేత

అనంతపురం : ఈనెల 22న ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య రాజుపాలెం చంద్రశేఖర్‌రెడ్డికి విమలాశాంతి జీవిత సాఫల్య పురస్కారం అందించనున్నట్లు విమలా శాంతి ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శాంతినారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దసరా సెలవుల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : గ్రీవెన్స్ డే సందర్భంగా గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రేడ్-3 గ్రంథాలయ అధికారి ఎ.ప్రతాపరెడ్డి పర్యవేక్షించా రు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

సాహితీ ప్రస్థానంలో 'ప్రేమ్‌చంద్' చెరగని ముద్ర

'జూపల్లి' మృతి తీరనిలోటు.. పలువురి నివాళి



అనంతపురం : ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్ అనారోగ్య కారణంగా గురువారం హైదరాబాదులో కన్నుమూశారు. ప్రేమ్‌చంద్ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎ తెలుగు చదివారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ బాబు 'రుధిర జ్యోతి' కావ్యంపై ఎం.ఫిల్ కూడా చేయడంతోపాటు గ్రంథాన్ని 'మౌనశంఖం' పేరుతో ప్రచురించారు. దీంతోపాటు 'సామాజిక పరిణామాలు..వచన కవిత్వం' అనే అంశంపై పిహెచ్‌డి చేశారు. అలాగే తను ప్రచురించిన 'అవేద' కావ్యాన్ని అనంతపురంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఆవిష్కరించారు. చాలా ఏళ్ల క్రితం న్యూజెర్సీ సాహిత్య సంస్థ ఒక కథారచన పోటీ నిర్వహిస్తే ప్రేమ్‌చంద్ కవితాత్మకంగా ఒక కథ రాశారు. అనంతపురం జిల్లా రచయితల సంఘానికి చాలాకాలం అధ్యక్షులుగా కూడా పని చేశారు. 2012లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సమయంలో 'అనంత కవిత', 'అనంత వ్యాసం' అని రెండు సంపుటాలకు సంపాదకులుగా ఉండి ప్రచురించారు. మార్క్సిజంతో పరిచయం ఉండేది. అస్తిత్వ ఉద్యమాలు మొదలయ్యాక అంబేద్కరిస్టు అయ్యాడు. అలాగే సినీనటుడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో రాయలసీమ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. జూపల్లి మరణం పట్ల ఆయన గురువు ఆచార్య రాజుపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, అరసం, సాహితీ స్రవంతి అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రగతి, రాష్ట్ర సభ్యులు పిల్ల కుమారస్వామిరెడ్డి, ఉమర్ అలీషా సాహితీ సంస్థ, విరసం, జనసం సభ్యులు, పలువురు సాహితీ ప్రముఖులు నివాళులర్పించారు.

మెడికోల 'ఫ్లాష్ మాబ్' అదరహో..

అనంతపురం : స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించనున్న ఫ్రెషర్స్ డే-2023 కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఇతర అన్ని బ్యాచ్‌ల మెడికోలకు ఆహ్వానం పలుకుతూ గురువారం నిర్వహించిన ఫ్లాష్ మాబ్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఇందులో భాగంగా కళాశాలలోని మైదానంలో కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ బ్యాచ్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాళ్లుశ్రీదేవి, కెఎల్.సుబ్రమణ్యం, షారోన్‌సోనియా, మేడా ఆత్మరామ్, బి.ఆర్ శ్యాంప్రసాద్, మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి శాంతిరెడ్డి, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ శంకర్, కల్చరల్ కమిటీ ఇన్‌ఛార్జిలు శైలజ, ఇందిరా, వైద్యులు హైమావతి, ఉమాదేవి, సంధ్యారాణి, శ్రీలత, వరదరాజులు, సునీల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహానాయక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సెస్ చెల్లించాలని వినతి



ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు ఆయా శాఖల నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనంతపురము నగర కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల నుంచి వారు సెస్సు వసూలు చేసి కూడా తమకు రావాల్సిన బకాయిలు సంస్థ నిధులకు జమచేయడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీ అధికారులకు పలుమార్లు చెప్పిన కూడా వారి నుంచి స్పందనలేదన్నారు. దీనివల్ల గ్రంథాలయ సంస్థ అభివద్ధికి తీవ్రమైన ఆటంకం ఏర్పడిందన్నారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేసి బకాయిలు సంస్థ నిధులకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఇన్‌ఛార్జి కలెక్టర్ త్వరలోనే మున్సిపల్ కమిషనర్లతో, జిల్లా పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రంథాలయ సంస్థ నిధులకు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్ఎస్‌బిఎన్ అధ్యాపకురాలికి 'జాతీయ సాహితీ పురస్కారం'



ఎస్ఎస్‌బిఎన్ అధ్యాపకురాలు ఫిరోజాకు జాతీయ సాహితీ పురస్కారం అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

తిరుపతి జిల్లా భాకరాపేటలోని ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు వాధులపల్లి ఫిరోజా తెలుగు సాహితీ పురస్కారం అందుకుంది. ఇందులో భాగంగా ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో కవులు, కళాకారులను పద్మశ్రీ బోయి భీమన్న జాతీయ సాహితీ పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కవిగా, రచయిత్రిగా, వక్తగా, అధ్యాపకురాలిగా, విద్యావేత్తగా కృషి చేసినందుకు ఫిరోజాకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, ప్రొఫెసర్.బుజ్జి, మార్జియానా ప్రొఫెసర్, కవులు పాల్గొన్నారు.

విఆర్‌ఓ మృతి బాధాకరం

నార్పల : మండల పరిధిలోని వెంకటాంపల్లి విఆర్‌ఓ వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని తహశీల్దార్ హరికుమార్ అన్నారు. ఈమేరకు పెద్దపప్పూరుకు వెళ్లి విఆర్‌ఓ వెంకటరమణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వెంకటాంపల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బెంగళూరుతో చికిత్స పొందుతూ మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

మిడుతూరులో చోరీ

పెద్దవడుగూరు : మండలంలోని మిడుతూరులో నివాసం ఉంటున్న హరిత ఇంట్లోకి బుధవారం రాత్రి దొంగలు చొరబడి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... హరిత తన ఇద్దరు కుమారులు విజయవాడలో చదువుతుండగా దసరా సెలవులు రావడంతో తీసుకొచ్చేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు చెప్పారు. ఈచోరీలో ఒకటిన్నర తులం బంగారు నగలతోపాటు 12 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితురాలు గురువారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి చోరికి పాల్పడిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ శ్రీనివాసులు ఇంటివద్దకు వెళ్లి పరిశీలించి సుమారు రూ.90వేలు విలువజేసే నగలను ఎత్తుకెళ్లారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బోయ వీధిలో బుధవారం రాత్రి బోయ దేవన్న ఇంట్లో బీరువాని పగలగొట్టి ఒక ఉంగరం జత కమ్మలు పట్టు చీరలు గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. అదేవిధంగా పెద్దమ్మ గుడి దగ్గర ఉన్న బోయ దేవుడు చిల్లర కొట్టులోని హుండీలో ఉన్న రూ.6వేల నగుదు, చిల్లర కొట్టులో ఉన్న సరుకులను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణయ్య, ఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతపురం నుంచి క్లూస్ టీంను రప్పించి పరిశీలించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇలాంటివి మరోసారి జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని గాజులపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పామిడి మండలం రామరాజుపల్లి గ్రామం నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనం గాజులపల్లి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం పరవస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో గాజులపల్లికి చెందిన బాల సుంకన్న, రామరాజుపల్లికి చెందిన రమేష్, రాకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బాలసుంకన్న కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రసాయన ఎరువులు చల్లి రైతు కూలీలకు అస్వస్థత

బొమ్మనహాల్ : వరి పైరులో రసాయన ఎరువులు చల్లిన రైతు కూలీలు వాటి ప్రభావంతో అస్వస్థతకు గురైన సంఘటన గురువారం మండల పరిధిలోని కొలగానహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొలగానహళ్లి గ్రామానికి చెందిన రైతు కావలి నాగరాజుతో పాటు కూలీలు కావలి రఘు, మహేంద్ర, వేణుగోపాల్, జగదీష్ 8 ప్యాకెట్ల కాంప్లెక్స్ ఎరువులు, 4 బస్తాల యూరియాతో పాటు 5 కిలోల 4-జి గుళికలు వరి పొలంలో చల్లారు. రసాయన ఎరువుల ప్రభావానికి గురై వారు పొలంలోనే అస్వస్థతకు గురవడంతో ఆటోలో ఉద్దేహాల్ ఆర్ఎంపి వద్దకు తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం బళ్లారికి తరలించారు. నియమ నిబంధనలు పాటించకుండా మార్కెట్‌లో విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు విక్రయించడం, వాటి గురించి రైతులకు పూర్తిగా వివరించకపోవడం వల్ల తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విష యమై మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా రసాయన ఎరువులు కొనుగోలు చేసిన రైతులు జిఎస్‌టి బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, తద్వారా నిబంధనలు పాటించని దుకాణదారులపై చర్యలు తీసుకోవచ్చని దాటవేశారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



ఇంటి పట్టా చూపుతున్న బాధితురాలు వెంకటలక్ష్మి

గుత్తి : జగనన్న కాలనీలో తనకు కేటాయించిన స్థలాన్ని వైసిపి నాయకుడు ఆక్రమించాడని పట్టణ పరిధిలోని 17వ వార్డులో నివాసం ఉంటున్న రామయ్య భార్య ఆర్.వెంకటలక్ష్మి వాపోయింది. ఈమేరకు స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని 684-2, 689, 697 సర్వే నెంబర్లలో అధికారులు జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇందులో రామయ్య భార్య ఆర్.వెంకటలక్ష్మికి 34వ ప్లాట్‌ను కేటాయిస్తూ పట్టా మంజూరు చేశారు. ఈనేపథ్యంలో రామయ్య ప్రమాదానికి గురై ఇంటిలో ఉండిపోయాడు. వెంకటలక్ష్మి కూడా అనారోగ్యానికి గురైంది. అయితే ఇటీవల కోలుకున్న ఆమె ఇల్లు నిర్మించుకోవాలని సచివాలయ అధికారులు చెప్పడంతో ఇసుక, రాళ్లను స్థలం వద్దకు తరలించింది. అనంతరం అక్కడికి వెళ్లి చూడగా ఓ వైసీపీ నాయకుడు స్థలాన్ని ఆక్రమించాడు. దీంతో లబోదిబోమంజూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థలాన్ని తనకు వదిలేయాలని వైసిపి నాయకుడు బెదిరిస్తున్నాడని వాపోయింది. అవసరమైతే మరోచోట స్థలాన్ని చూపిస్తామని, అక్కడ ఇల్లు నిర్మించుకోవాలని చెబుతున్నట్లు వాపోయింది. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన తన స్థలాన్ని ఇప్పించి ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

ఎమ్మెల్యే 'తోపుదుర్తి'కి కృతజ్ఞతలు

అనంతపురం : 25ఏళ్లుగా నోచుకోని ప్రసన్నాయపల్లి ప్రధాన రహదారిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేయడంతో ప్రసన్నాయపల్లి పంచాయతీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గురువారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసన్నాయపల్లి వైసిపి ఇన్‌ఛార్జి వెన్నపూస లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రహదారి బ్రిటీష్ కాలం నాటి మాస్టర్ ప్లాన్‌లో 120 అడుగుల రోడ్డు ఉందన్నారు. అనంతపురం నుంచి జెఎన్‌టియు, చిన్మయనగర్ మీదుగా రాప్తాడు బెంగళూరు హైవేలో రహదారి కలుస్తుందన్నారు. రహదారి నిర్మించాలని గతంలో ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అయితే ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.15 కోట్లతో సుమారు 2 కిలోమీటర్ల మేర రహదారిని ఏర్పాటు చేసి హామీని నిలబెట్టుకున్నారన్నారు.

21 నుంచి పోలీసు అమరవీరుల వారోత్సవాలు : ఎస్పీ

అనంతపురం క్రైం : ప్రతిఏటా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న వారోత్సవాలు 31వ తేదీ వరకూ సాగుతాయన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసుల్ని గుర్తు చేసుకోవడంతోపాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. 1959 అక్టోబర్ 21న దేశ భద్రత కోసం 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు భారత్ చైనా సరిహద్దుల్లో ఉన్న లడక్ ఆక్సయుచిన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా భారీ సంఖ్యలో చైనా సైనికులు భారత సరిహద్దుల్లోకి చొరబడి ఒక్కసారిగా మన సీఆర్పీఎఫ్ జవాన్లపై విరుచుకుపడ్డారన్నారు. సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ భారత్ జవాన్లు ఆత్మస్థైర్యంతో చైనా సైనికులను ఎదిరిస్తూ చివరి రక్తం బొట్టు వరకు పోరాడారని గుర్తు చేశారు. అప్పుడు దేశం కోసం అసువులు బాసిన వారిని స్మరించుకునేందుకు అప్పటి నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 21న అమరవీరుల సంస్మరణ దినం, స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు, శ్రద్ధాంజలి, 22 నుంచి 30వ తేదీ వరకూ పోలీసు అమరుల గ్రామాల సందర్శించి అమరుల సేవలను వివరించనున్నట్లు తెలిపారు. అలాగే 24 నుంచి 27 వరకూ చర్చా వేదికలు, వక్తృత్వ పోటీలు, 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు, 26 నుంచి 27 వరకూ ఓపెన్ హౌస్‌ల నిర్వహణ, జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌తో పాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్ల స్థాయిలో ఓపెన్ హౌస్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. 28న వైద్య శిబిరాలు, రక్తదానాలు, 28 నుంచి 30 వరకూ పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు, 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులకు సన్మానం, 31న సమైక్యతా దినంతో వారోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' అభినందనీయం



రైతులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న దృశ్యం

ఉరవకొండ : జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు 'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి బసవ రాజేంద్ర మహాస్వాముల కొనియాడారు. గురువారం స్థానిక గవిమఠంలో 'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం' కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించారు. అనంతరం రేణుమాకులపల్లి, నింబగల్లు గ్రామాల్లోకి వెళ్లి రైతుల పంటపొలాల్లో పనిచేస్తున్న 50 మంది రైతులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ సంస్థ నాగమల్లి ఓబులేసు, ఫౌండేషన్ ప్రతినిధులు నాగమల్లి రజినీకుమారి, నాగమల్లి గోపాల్, నాగమల్లి వంశీకృష్ణ, బాబు, సురేంద్ర, రమేష్, పురుషోత్తం, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, చిన్నారులు వైష్ణవి, 12 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



గుత్తి మండలంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తురకపల్లి, కొజ్జేపల్లి గ్రామాల్లోని రైతులు నాగన్న, బాలన్న సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత కరువు ప్రాంతమైన జిల్లారైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తే వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, మండల కార్యదర్శి జి.రామదాసు, నాయకులు మధు, రామాంజనేయులు, ఉమర్ బాషా, గోపీనాథ్, దేవేంద్ర, రమేష్, మురళి పాల్గొన్నారు.

గార్లదిన్నె : పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం గార్లదిన్నె మండలంలోని ఎగువపల్లి గ్రామంలో సాగు చేసి ఎండిపోయిన వేరుశనగ, పత్తి, కంది, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ ఎన్నికల గురించి ఆలోచించడం తప్ప ప్రజా సంక్షేమంపై లేదన్నారు. వెంటనే పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, తాలూకా కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, రైతుసంఘం కార్యదర్శి రాము, మల్లికార్జున, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామీణులకు రక్ష



వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణులకు రక్ష అని ఎంపిపి వాల్మీకి మాధవి తెలిపారు. మండలంలోని తిమ్మాపురంలో సర్పంచి నీలమ్మ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలను నిర్లక్ష్యం చేయడం, వాటి పట్ల అవగాహన లేకపోవడంతో ఆరోగ్యంగా కుంగిపోతున్నారన్నారు. అదేవిధంగా చిన్నచిన్న రోగాలను నిర్లక్ష్యం చేస్తూ వైద్యులతో చికిత్స తీసుకోకుండా కిరాణా కొట్లలో మాత్రల మింగుతూ ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. ఈనేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణప్ప, ఇఒఆర్‌డి నరసింహులు, వైసిపి మండల కన్వీనర్ మోహన్, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి సునీత, అధికారులు

శింగనమల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి భారీ స్పందన వస్తోందని ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల అధికారిణి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకే వైద్యసేవలు అందించడం శుభ పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. తర్వాత గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సునీత, మండల విస్తరణ అధికారి మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసులు, ఎఒ అన్వేష్‌కుమార్, ఎంఇఒ-2 శివప్రసాద్, వీఆర్వో నాగేంద్ర, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, డాక్టర్ శంకర్‌నాయక్, టిప్పుసుల్తాన్, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని సిద్ధరాంపురం ఎంపిపి పాఠశాలలో సర్పంచి కొండన్న ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 506 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురిని పెద్దాసుపత్రికి సిఫారసు చేశారు. వైఎస్‌ఆర్ కంటి వెలుగు కింద 122 మందికి పరీక్షలు నిర్వహించగా 22 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, జడ్పిటిసి భాస్కర్, పసులూరు సర్పంచి కల్పన, ఎంపిటిసి వెంకటలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ తేజోష్ణ, వైద్య నిపుణులు డాక్టర్ రాజు, శోభారాణి, తెహరోన్ని, వినోద్ కుమార్, సిహెచ్ఒ మోహన్‌రావు, పీహెచ్‌ఎం చెన్నమ్మ, పంచాయతీ సెక్రటరీ రవికుమార్, వైసిపి మండల కన్వీనర్ అంకే నరేష్, అంగడి శివానంద, జి.నారాయణస్వామి, ఆకుల నాగముని, కొండాపురం మల్లేష్, సచివాలయ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జడ్పీటీసీ పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు తెలిపారు. గురువారం మండలంలోని నింబగల్లులో సర్పంచి సునీత ఓబులేసు ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అమృతరాజ్, ఎంపిటిసి సోంపల్లి ఈశ్వర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ చిదంబరంనాయుడు, వైద్యసిబ్బంది, వైసిపి నాయకులు ఈశ్వర్, ఓబులేసు, హనుమప్ప, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండలం హావలిగి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, సర్పంచి గీతమ్మ వైద్యాధికారులు అరుణకుమారి, ఎంపిటిసిలు కళావతి రాజశేఖర్, రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, సచివాలయం కన్వీనర్లు రఘురాములు, మడకశిర రాజశేఖర్, ఆరోగ్య, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 49వ డివిజన్‌లో టిడిపి నాయకులు గురువారం 'బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌ఛార్జి వన్నూర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆదేశాల మేరకు 49వ డివిజన్ నిర్వహించిన బాబుతో నేను కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, వెంకటేష్, రామ సుబ్బయ్య, ముబారక్, హనీఫ్, నాగరాజు, కె.పద్మావతి, ఫరిదాబేగం, టైలర్ సేన, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గురువారం ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆలం నరసానాయుడు మాట్లాడుతూ రాజకీయ వ్యూహంతో ఓ కుట్రను రచించి పథకం ప్రకారం చంద్రబాబును అరెస్టు చేయించారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు కావడంతో ప్రపంచ దేశాల్లోనూ ఆయనకు సంఘీభావంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, వెంకటనారాయణమ్మ, సాంబశివాండ్డి, సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, మల్లిరెడ్డి, కేశవరెడ్డి, నరసింహారెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి, వి.రాయపరెడ్డి, రామిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రాఘవనాయుడు, రాజన్న, చంద్రబాబు, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, లింగప్ప, రమణ, భార్గవ్, పప్పూరు సత్తి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గురువారం కంబదూరు మండల పరిధిలోని ములకనూరు గ్రామంలో 'బాబు కోసం మేము సైతం' కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలు దండుకున్న నాయకులు, బాబాయ్‌ను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన వారు రాష్ట్రంలో యథేచ్ఛగా తిరుగుతుండగా, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల బాగోగుల కోసం పోరాడే నాయకులను జైలులో పెట్టి సిఎం జగన్ తన శాడిజం చూపుతున్నారన్నారు. అరాచక శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా చివరకు ధర్మమే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు శివన్న, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు



ఆత్మకూరు మండలంలో జలదీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

రాయదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబుకు గురువారం నియోజకవర్గ రైతులు వినూత్నంగా మద్దతు తెలిపారు. టిడిపి హయాంలో 'రైతు రథం' పథకం కింద లబ్ధి పొందిన వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ పనులు మానుకుని గుమ్మఘట్ట మండల పరిధిలోని గోనబావి గ్రామం వద్దకు చేరుకుని ట్రాక్టర్లతో చంద్రబాబుకు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో సబ్సిడీపై ట్రాక్టర్లు పొందామని, అందుకు కృతజ్ఞత గా సంఘీభావం ప్రకటించామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు, మండల కన్వీనర్ గిరిమల్లప్ప, దేవేంద్ర, ఉస్మాన్, సర్పంచి నాగరాజు, సత్తి, సంజీవ, రమేష్, చెన్నప్ప, ఆనందరెడ్డి, దుర్గేష్, వెంకటేశులు, చిన్ని కృష్ణ, మూర్తి, అంజి, దోనప్ప, పాపారాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అక్రమంగా అరెస్టు చేసిన టిడిపి అధినేత చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని సింగంపల్లి చెరువులో నాయకులు జలదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడు అన్నారు. అలాంటి నాయకుడి పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడటం బాధాకమన్నారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిచారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి కుళ్లాయప్ప, ఐ టీడీపీ బిల్లే బాల ఉజ్జినప్ప, తెలుగు యువత అంకే ఆనంద్, నాయకులు గాలి నరసింహులు, మహేష్, శీనానాయక్, చెన్నమ్మ, మంగలి ఆనంద్, దొడగట్టు నాగార్జున, పొడిచెరువు నాగేంద్ర, మంత్రిగారి నరేష్, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, బోయ రమేష్, తలారి నిరంజన్, ఎర్రిస్వామి, దొడగుట్ట అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

జీవోలను రద్దు చేయాలని ధర్నా

గుత్తి : జీవో 21, 31ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి మాట్లాడుతూ యువకులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల ద్వారా అప్పులు చేసి కొనుగోలు చేసిన ఆటోలను నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం నవరత్న పథకాలను కొనసాగించడానికి ప్రజలపై అనేక పన్నుల భారాన్ని మోపేందుకు సిద్ధమైందన్నారు. ప్రభుత్వ విడుదల చేసిన జీవోల ద్వారా వేలకు వేలు ఆటో డ్రైవర్లు ఈ చలానాలు కట్టలేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఈ చలానాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు రూ.వెయ్యి నుంచి రూ.60 వేలు దాకా జరిమానా విధించేలా ప్రభుత్వం జీవోలను విడుదల చేసిందన్నారు. జీవోలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుత్తి పాండురంగంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, నాయకులు పూలమాబు, రాజు, ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆర్ బి.రామంజి, కార్యదర్శి షేక్ నజీర్, రజాక్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ఉరవకొండ : మండలంలోని చిన్న ముస్టూరు గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులను శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి గురువారం పరిశీలించారు. సువర్ణ ట్రస్టు ద్వారా టీటీడీ వారు ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఎమ్మెల్సీ నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, కమిటీ, ట్రస్టు సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రమణయాదవ్, వైసిపి నాయకులు తిప్పారెడ్డి, ముష్టూరు ఎర్రిస్వామి, అర్జునప్ప, మాజీ ఎంపిటిసి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనను బలోపేతం చేయాలి

అనంతపురం : జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు పని చేయాలని జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్, రాయలసీమ ప్రాంతీయ మహిళా కమిటీ సభ్యులు పెండ్యాల శ్రీలత, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని జనసేన కార్యాలయంలో ప్రముఖ వ్యాపారవేత్త డాలర్ మధు ఆధ్వర్యంలో 50 మంది యువకులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ముఖ్యంగా అనంతపురంలో అభివృద్ధి ఏమాత్రం కానరావడం లేదన్నారు. కేవలం కేంద్రం నిధులతో జరిగిన పనులను వైసిపి తమ గొప్పలుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, సిద్ధు, జయమ్మ, అవుకు విజయకుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, చక్రపాణి, కార్యదర్శులు కుమ్మర మురళి, వడ్డే వెంకటేష్, వెంకటరమణ, ఆకుల అశోక్, సుధీర్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, నాయకులు శీను, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.



జనసేనలోకి ఆహ్వానిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్